డీఎస్ మూలాలు ఇక్కడే..

- వేల్పూర్‌లో పెరిగినా పుట్టింది మాత్రం ఏర్గట్లలోనే..
- డీఎస్ తండ్రి, తాత తమ సొంతూరిని వదిలి వేల్పూర్‌లో నివాసం ఏర్పాటు చేసుకున్నారని చెబుతున్న ఏర్గట్ల వాసులు


డీఎస్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి

మోర్తాడ్(బాల్కొండ): పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి డి. శ్రీనివాస్(డీఎస్) మూలాలు ఏర్గట్ల మండల కేంద్రంలో ఉన్నాయి. డీఎస్ ఏడు సంవత్సరాల వయస్సులో ఉన్నప్పుడు ఆయన తాత ధర్మపురి వెంకన్న, తండ్రి వెంకట నర్సయ్యలు కుటుంబంతో సహా వేల్పూర్‌కు వెళ్లిపోయారు. డీఎస్ అమ్మమ్మ ఇల్లు వేల్పూర్‌లో ఉండటంతో వారి కుటుంబం ఏర్గట్లను విడిచి అక్కడ నివాసం ఏర్పాటు చేసుకున్నారు. ఇంటిని అప్పట్లోనే విక్రయించడంతో వారికి ఏర్గట్లలో ఎలాంటి స్థిరాస్తి లేకపోయింది. పీసీసీ అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలను స్వీకరించిన డీఎస్ 2004 ఎన్నికల్లో అప్పటి కాంగ్రెస్ సీఎం అభ్యర్థి వైఎస్సార్‌తో కలిసి బస్సు యాత్రలో ఏర్గట్లలో పర్యటించారు. ఏర్గట్లలో డీఎస్ ప్రసంగిస్తూ తాను పుట్టిన గడ్డపై పీసీసీ అధ్యక్షుడి హోదాలో మాట్లాడటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. డీఎస్ బీఆర్ఎస్‌లో చేరి ఎంపీగా ఎన్నికైన తరువాత ఏర్గట్లకు గ్రంథాలయ భవనం నిర్మించడానికి రూ.10లక్షల నిధులను మంజూరు చేశారు. సాంకేతిక కారణాలతో గ్రంథాలయం భవనాన్ని ఇప్పుడు పోలీసు స్టేషన్ కోసం వినియోగిస్తున్నారు. డీఎస్ సోదరి భాగ్యవతిని మోర్తాడ్‌కు చెందిన గిర్మాజి గంగాధర్‌కు ఇచ్చి వివాహం జరిపించారు.

క్లుప్తంగా

ఫ్రీజర్ వితరణ



బోధన్: సాలూర మండలంలోని జాడిజమాల్‌పూర్ గ్రామ చర్చికి ఇదే గ్రామానికి చెందిన సొసైటీ మాజీ చైర్మన్ గాలి చిన్నయ్య రూ.70 వేలు విలువ చేసే ఫ్రీజర్‌ను శనివారం అందించారు. సొసైటీ చైర్మన్ దాసరి అంతయ్య, గ్రామ పెద్దలు గోగినేని నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

బాల్కొండలో..

బాల్కొండ: లయన్స్ క్లబ్ ఆఫ్ బాల్కొండకు క్లబ్ చైర్మన్ జ్ఞాన సాగర్ రెడ్డి ఫ్రీజర్‌ను అందజేశారు. తన తండ్రి నారాయణ రెడ్డి జ్ఞాపకార్థం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చాకులింగం, బాధ్యులు పోతు ప్రసాద్, మల్లేశ్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. పట్టణంలోని 3, 19 వార్డులో నిర్మిస్తున్న డ్రైనేజీలను పరిశీలించారు. అలాగే అక్రమ ఇంటి నిర్మాణాలను పరిశీలించి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఇళ్లకు నోటీసులు జారీ చేశారు. సానిటరీ ఎస్సై మహేష్, టీపీవో హరీష్, అర్జున్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



మోర్తాడ్: ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్‌లో 15 రోజుల కింద తాటి చెట్టుపై నుంచి పడి మరణించిన బోదాసు గంగాధర్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారం ఏదైనా ఉంటే ఇప్పిస్తానని తెలిపారు. నాయకులు దేవారెడ్డి, ఆడెపు గంగా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తకు..

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త వినేష్ భార్య అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో వారి కుటుంబాన్ని శనివారం డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి పరామర్శించారు. వైద్యం కోసం రూ.5 వేల నగదు సహాయాన్ని అందజేశారు. ముప్కాల్ మండలం వెంచిర్యాల్‌కు చెందిన నరేష్, మెండోరా మండలం వెల్కటూర్ గ్రామానికి చెందిన అరవింద్‌లు మృతి చెందడంతో వారి కుటుంబాలను పరామర్శించారు.

రాష్ట్ర స్థాయి పురస్కారం అందజేత



మోర్తాడ్: ఏర్గట్ల మండలం తడపాకల్‌కు చెందిన విద్యార్థిని మహ్మద్ రిమ్‌షాకు రాష్ట్ర స్థాయి పురస్కారాన్ని ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ జావిద్ శనివారం అందజేశారు. వసుంధర విజ్ఞాన మండలి పెద్దపల్లి ఆధ్వర్యంలో గత ఏప్రిల్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కవితా పోటీల్లో రిమ్‌షా పాల్గొనగా ఆమెకు ప్రథమ బహుమతి లభించింది. ఈ బహుమతిని సదరు సంస్థ వారు పంపించగా వాటిని ప్రధానోపాధ్యాయుడు విద్యార్థికి అందించారని పూర్వపు తెలుగు పండిట్ ప్రవీణ్ శర్మ వెల్లడించారు. ఉపాధ్యాయులు సుధాకర్, కృష్ణ ప్రసాద్, గంగాధర్, నవీన్, ఆనంద్, రాములు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ డివిజన్-1 సూపరింటెండెంట్‌గా టీఎన్జీవోస్ పోచంపాడ్ అధ్యక్షుడు జాన్ సుభాకర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను డివిజన్- 1 విభాగంలోని అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ గణేష్, హెచ్‌డీ భూమన్న, గణాంక అధికారి జగదాంబరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర చట్టం తీసుకురావాలి

రెంజల్(బోధన్): వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం తీసుకురావాలని, కనీస జీతం రోజుకు రూ.600 అందించాలని డిమాండ్ చేస్తూ శనివారం రెంజల్ తహసీల్దార్ కార్యాలయం ముందు అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. 50 సంవత్సరాలు దాటిన కార్మికులకు ఐడీ కార్డులు అందించి పెన్షన్‌లు మంజూరు చేయాలని నినాదాలు చేశారు. డి మాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌కు అందించారు. ప్రతినిధులు నసీర్, పార్వతి, రాజేశ్వర్ పాల్గొన్నారు.

అటెండర్ సేవలు అభినందనీయం


నీరజను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, అధికారులు

ఆర్మూర్‌టౌన్: అటెండర్ నీరజ అందించిన సేవలు అభినందనీమని మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో శనివారం అటెండర్ నీరజ పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ... గత 28 సంవత్సరాలుగా నీరజ తన సేవలతో అధికారుల మెప్పు పొందిందన్నారు. ఇకపై నీరజ తన శేష జీవితాన్ని సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్‌మున్ను, మున్సిపల్ కమిషనర్ రాజు, కౌన్సిలర్ బాదం రాజ్ కుమార్, సానిటరీ ఎస్సై మహేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సొమ్ము రికవరీకి కృషి చేస్తా


మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ బూరోళ్ల అశోక్

మాక్లూర్: గత చైర్మన్ హయాంలో జరిగిన నిధుల దుర్వినియోగాన్ని రికవరీ చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ప్రస్తుత మాక్లూర్ సొసైటీ చైర్మన్ బూరోళ్ల అశోక్ స్పష్టం చేశారు. ఈ విషయంలో తన పదవి పోయినా పర్వాలేదన్నారు. శనివారం సొసైటీలో నిధుల దుర్వినియోగ విషయమై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కల్లెడి, అడవి మామిడిపల్లికి చెందిన రైతులు పోశెట్టి, గంగాధర్‌గౌడ్, వింధ్యో మాజీ చైర్మన్ దయాకర్‌రావులు మాట్లాడుతూ.. సొసైటీలో అసలు దుర్వినియోగమైన సొమ్ము ఎంత.. ఎవరి హయాంలో జరిగింది.. అందుకు సహకరించింది ఎవరనేది సభా ముఖంగా బహిర్గతం చేయాలన్నారు. సుమారు రూ: 2 కోట్లకుపైగా దుర్వినియోగమైనట్లు ప్రాథమిక విచారణలో తేలిందని ప్రస్తుత సీఈవో సీహెచ్ విష్ణువర్ధన్ వెల్లడించారు. నిధులు దుర్వినియోగం చేసిన వారి వద్ద డబ్బులను రికవరీ చేసి, జైలుకు పంపించాలని రైతులు కోరారు. మాజీ చైర్మన్ భాస్కర్ రావు, స్థానిక ఎంపీటీసీ వెంకటేశ్వర్‌రావు, రైతులు పాల్గొన్నారు.

పాఠశాల అంటే విద్యార్థులకు భయం పోవాలి


వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

ఆర్మూర్‌టౌన్: విద్యార్థులకు పాఠశాల అంటే భయం పోవాలని, సంతోషంగా పాఠశాలలకు వచ్చే విధంగా ఫ్రెషర్స్ వేడుకలు నిర్వహించామని స్టైల్ స్కూల్ డైరెక్టర్ రఫీ గోహర్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని హౌసింగ్‌బోర్డు విద్యానగర్‌కాలనీలో గల స్టైల్ స్కూల్‌లో శనివారం ఫ్రెషర్స్ డే జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ రఫీగోహర్ మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో స్నేహ పూర్వ వాతావరణంలో మెలగాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. పాఠశాల కరస్పాండెంట్ షబానా గోహర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా..


ఆర్థిక సహాయం అందజేస్తున్న చేపూర్ గ్రామస్తులు

పెర్కిట్(ఆర్మూర్): బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తూ స్ఫూర్తిగా నిలిచారు ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామస్తులు. చేపూర్‌లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వన్నెల ప్రభాకర్ కుటుంబానికి గ్రామస్తులు శనివారం రూ.73 వేల ఆర్థిక సహాయం అందజేసి చేయూతనందించారు. గ్రామానికి చెందిన పోలీస్ హెడ్ కానిస్టేబుల్ మీనుగు రాజేశ్వర్, కష్టాల్లో ఉన్న కుటుంబాలను ఆదుకోవడానికి గ్రామానికి చెందిన యువకులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, ఎన్నారైలతో వాట్సాప్‌లో గ్రూపు ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన వారు ఎవరైనా కష్టాల్లో ఉన్నారని తెలియగానే గ్రూపు సభ్యులకు సమాచారం ఇస్తున్నారు. దీంతో సభ్యులు తమకు తోచిన విధంగా ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నారు.

సమాచారం..

■ దరఖాస్తుల ఆహ్వానం

ఆర్మూర్‌టౌన్: మామిడిపల్లిలో గల మోడల్ స్కూల్ వసతి గృహంలో రెండు పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వసతిగృహం వార్డెన్ సునంద తెలిపారు. వసతి గృహంలో హెడ్ కుక్ పోస్టుకు ఒక ఖాళీ ఉందని, ఆ ఉద్యోగానికి నెలకు రూ.7,800, వాచ్‌మన్, ఉమెన్ పోస్టుకు రూ.8,710 వేతనం ఉందన్నారు. పదవ తరగతి పాసైన మహిళా అభ్యర్థులు అర్హులని ఆమె తెలిపారు. జూలై 5లోపు మోడల్ స్కూల్‌లోని వసతి గృహంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

■ జూలై 2న మోడల్ స్కూల్, కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

రుద్రూర్: అంబం(ఆర్) శివారులో గల మోడల్ స్కూల్, జూనియర్ కాలేజ్‌లో మిగిలిపోయిన సీట్లకు జులై 2న ఉదయం 10.30 నుంచి స్పాట్ అడ్మిషన్లు ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆలూరి నరేందర్ తెలిపారు. తొమ్మిదవ తరగతిలో ఆరు ఖాళీలు, పదవ తరగతిలో 10, ఇంటర్ సీఈసీలో 15, బైపీసీలో మూడు, ఎంపీసీలో నాలుగు ఖాళీలు ఉన్నట్లు ఆయన వివరించారు. వివరాలకు మోడల్ స్కూల్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

■ ఉచిత యోగా శిక్షణ తరగతులు

పెర్కిట్(ఆర్మూర్): పెర్కిట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పతంజలి యోగా సమితి, భారత్ స్వాభిమాన్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఉచిత యోగా, ప్రాణాయామ, విజ్ఞాన శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు యోగా శిక్షకుడు బుచ్చన్న తెలిపారు. ఉదయం ఐదున్నర నుంచి 7 గంటల వరకు పురుషులు, స్త్రీలకు, సాయంత్రం ఐదున్నర గంటల నుంచి ఆరున్నర గంటల వరకు స్త్రీలకు యోగాలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

డీఎస్‌కు నివాళులు



వేల్పూర్: పీసీసీ మాజీ అధ్యక్షుడు ధర్మపురి శ్రీనివాస్ అనారోగ్యంతో మరణించడంతో ఆయన స్వగ్రామం వేల్పూర్ మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు ఘనంగా నివాళులర్పించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన సేవలను కొనియాడారు.

డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ కోసం కృషి చేయాలి



ఆర్మూర్‌టౌన్: డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ కోసం విద్యార్థులందరూ కృషి చేయాలని తెలంగాణ విద్యార్థి సేన నాయకుడు వెంకటేష్ అన్నారు. పట్టణంలోని టీఎస్‌వీఎస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటేష్ మాట్లాడారు. కొందరు ఇంటర్ విద్యార్థులను టార్గెట్‌గా చేసుకొని డ్రగ్స్‌కి అలవాటు చేస్తున్నారని ఆరోపించారు. చెడు అలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. నాయకులు సాయి, కిశోర్, దిలీప్, గణేష్, అనిల్ పాల్గొన్నారు.

పీఆర్సీ బకాయిలను తక్షణమే చెల్లించాలి



బోధన్‌టౌన్(బోధన్): మున్సిపల్ కార్మికులకు పెరిగిన పీఆర్సీ వేతనంతో పాటు బకాయిలను తక్షణమే చెల్లించాలని ఇఫ్టు నాయకులు బి.మల్లేష్ డిమాండ్ చేశారు. శనివారం ఇఫ్టు ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి బల్దియా కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇఫ్టు నాయకులు మాట్లాడారు. పారిశుధ్య కార్మికులకు ఇవ్వవలసిన పనిముట్లు ఇవ్వకపోవడంతో కార్మికులు తమ సొంత డబ్బులు పెట్టి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. నాయకులు మోహన్, ఈర్షత్, పోశెట్టి, అబ్బయ్య, భూమయ్య, తదితరులు ఉన్నారు.

జాతీయ రహదారి పనులకు సీజ్ చేసిన ఇసుక

రెంజల్(బోధన్): బోర్గాం శివారులో సీజ్ చేసిన ఇసుక నిల్వలను జాతీయ రహదారి పనులకు తరలిస్తున్నట్లు తహసీల్దార్ శ్రావణ్ కుమార్ తెలిపారు. ఇటీవల బోర్గాం శివారులో సుమారు 1000 ట్రాక్టర్ల అక్రమ ఇసుక నిల్వలను గుర్తించి సీజ్ చేశారు. పెద్దమొత్తంలో ఇసుక నిల్వలు పట్టుబడటంతో జిల్లా కలెక్టర్‌కు చర్యల నిమిత్తం నివేదికను పంపారు. సీజ్ చేసిన ఇసుక నిల్వలకు వేలం వేయడం ఆనవాయితీగా వస్తుంది. అందుకు భిన్నంగా ప్రభుత్వ పనులకు తరలించడంతో అక్రమార్కుల్లో ఆందోళన ఏర్పడింది.

గుట్టలు, బీడు భూములకు 'రైతు భరోసా' వద్దు


అభిప్రాయాలు తెలుసుకుంటున్న ప్రత్యేక అధికారి పాపయ్య

మాక్లూర్: గత ప్రభుత్వం మాదిరిగా గుట్టలు, బీడు భూములకు కాకుండా నిజంగా పంటలు పండే భూములకు.. అది కూడ ఐదు ఎకరాల లోపు ఉన్న రైతులకే రైతు భరోసా ఇవ్వాలని రైతులు అభిప్రాయపడ్డారు. శనివారం మండల కేంద్రంలోని సొసైటీలో చైర్మన్ బూరోళ్ల అశోక్ అధ్యక్షతన రైతు భరోసా పథకం అమలుపై రైతులతో సమావేశం జరగగా ప్రత్యేక అధికారి పాపయ్య రైతుల అభిప్రాయాలను రికార్డు చేసుకున్నారు. ఐదు ఎకరాలు లోపు ఉన్న వారికే రైతు భోరోసా వర్తింపజేయాలని మెజార్టీ రైతులు కోరారు. స్పెషల్ అధికారి పాపయ్య మాట్లాడుతూ..సేకరించిన అభిప్రాయాలను ప్రభుత్వానికి పంపిస్తానని చెప్పారు. అనంతరం జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు మాట్లాడారు.10 ఎకరాలు ఉన్న రైతులను పరిగణనలోనికి తీసుకుంటేనే అత్యధిక రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. పలువురు అభ్యంతరం చెప్పారు.

కొత్త ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించాలి


మాట్లాడుతున్న జెడ్పీటీసీ గంగారాం

రుద్రూర్: గ్రామాల్లో కొత్తగా నిర్మించుకునే ఇళ్లకు మీటర్లు కేటాయించి విద్యుత్ సౌకర్యం కల్పించాలని మండల పరిషత్ సభ్యులు కోరారు. రుద్రూర్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ అక్కపల్లి సుజాత అధ్యక్షతన ఏర్పాటు చేశారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. ఆయా శాఖల ప్రగతిని అధికారులు వివరించారు. సీజనల్ వ్యాధుల పట్ల మండల వైద్యాధికారిణి అయేషా సిద్ధిఖీ అవగాహన కల్పించారు. మండల పరిషత్ పాలకవర్గానికి చివరి సమావేశం కావడంతో ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులను అధికారులు ఘనంగా సన్మానించారు. పదవీ విరమణ పొందుతున్న మండల విద్యా శాఖాధికారి శాంతకుమారిని సన్మానించారు. జెడ్పీటీసీ నరోజీ గంగారాం, వైస్ ఎంపీపీ నట్కరి సాయిలు, ఎంపీడీవో సురేష్ బాబు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి


నీటిని పరిశీలిస్తున్న అధికారులు

బోధన్‌టౌన్(బోధన్): వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పాఠశాల ఆవరణలో నీటి నిల్వలు చెత్తాచెదారం ఉండకుండా యాజమాన్యాలు చర్యలు చేపట్టాలని ఇన్‌చార్జి జిల్లా వైద్యాధికారి తుకారం రాథోడ్ సూచించారు. శనివారం యాంటీ మలేరియా, యాంటీ డెంగీ డే మంత్‌లో భాగంగా బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లిలో పర్యటించారు. ప్రతీ ఇంటికి వెళ్లి నీటి నిల్వలను పరిశీలించారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీపై ప్రజలకు అవగాహన కలిగించారు. జిల్లా ఉప వైద్యాధికారి విద్య, జిల్లా డీఈఎంవో జావిద్, వైద్యారోగ్య సిబ్బంది ఉన్నారు.

ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీని నెరవేర్చాలి


మాట్లాడుతున్న లక్ష్మీనర్సయ్య

ఆర్మూర్: సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఏఐటీయూసీ ఆర్మూర్ మండల అధ్యక్షుడు లక్ష్మీనర్సయ్య డిమాండ్ చేశారు. ఆర్మూర్ పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు తరహాలో సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సహాయం అమలు చేయాలన్నారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణంతో లక్షలాది మంది ఆటో డ్రైవర్ల కుటుంబాలు వీధిన పడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు శ్రీనివాస్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలుగా తీర్చిదిద్దాలి


మాట్లాడుతున్న రసూల్‌బీ

నందిపేట్(ఆర్మూర్): ప్రతి అంగన్‌వాడీని మోడల్ కేంద్రంగా తీర్చిదిద్దాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి రసూల్‌బీ అన్నారు. నందిపేట మండల కేంద్రంలోని మూడు సెక్టార్ల పరిధిలో గల అంగన్‌వాడీ టీచర్లతో సమావే శం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీచర్లకు ఇచ్చిన ఈసీసీఈ(పూర్వ బాల్య సంరక్షణ విద్య) అనే అంశంపై శిక్షణ గురించి తెలుసుకున్నారు. శిక్షణ విషయాలను అనుసరించి అంగన్‌వాడీ సెంటర్లను తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూజర్‌వైజర్లు సుమ, రేఖ, అన్నపూర్ణ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సరిహద్దులు ఏర్పాటు చేయండి



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రం శివారులో వరద కాలువ జీరో పాయింట్ వద్ద ముప్కాల్, బాల్కొండ మండలం బస్సాపూర్ గ్రామాల శివారుల సరిహద్దులను ఏర్పాటు చేయాలని ముప్కాల్ మండల కేంద్ర సన్నకారు రైతు సంఘం సభ్యులు శనివారం తహసీల్దార్ శ్రీకాంత్‌కు వినతి పత్రం అందజేశారు. సరిహద్దు రాళ్లు లేకపోవడంతో తరుచూ రెండు గ్రామాల మధ్య వివాదం తలెత్తుతోందని, సర్వే నిర్వహించి సరిహద్దులు ఏర్పాటు చేయాలని వారు కోరారు. సభ్యులు సాయన్న, దినేష్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



ఎడపల్లి(బోధన్): చట్టాలపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని జడ్జి సాయిశివ అన్నారు. ఎడపల్లి గ్రామ శివారులో గల బాలికల గురుకుల పాఠశాలలో శనివారం విద్యార్థినులకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థినులు మనోధైర్యంతో ముందుకు సాగాలన్నారు. విద్యార్థులు సామాజిక బాధ్యతను తెలుసుకోవాలన్నారు. బోధన్ ఏసీపీ శ్రీనివాస్, రూరల్ సీఐ నరేష్, ఎస్సై వంశీకృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ సుహాసిని, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 -	కల్కి ఏడీ-2898 (తెలుగు) - 9.30, 4.15, 11.00 మహారాజ (తెలుగు) - 1.15, 8.00
స్క్రీన్-2 -	కల్కి ఏడీ-2898 (తెలుగు) - 8.00, 11.45, 3.30, 7.15, 11.00
స్క్రీన్-3 -	కల్కి ఏడీ-2898 (తెలుగు) - 10.05, 1.50, 5.35, 9.20
స్క్రీన్-4 -	కల్కి-2898 (తెలుగు) - 11.05, 2.50, 6.35, 10.20

సంక్షిప్తం

సీఐని కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

భీమ్‌గల్: భీమ్‌గల్ పట్టణ సీఐగా బాధ్యతలు తీసుకున్న నవీన్ కుమార్‌ను మండల యువజన కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు.శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. నాయకులు నాగేంద్ర బాబు, శ్రీరామ్ రవి, భాస్కర్, విక్రమ్, భోజ రాకేష్, తదితరులున్నారు.

పరామర్శ

భీమ్‌గల్: ఇటీవల మరణించిన బాధిత కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి శనివారం పరామర్శించారు. మెండోరాకు చెందిన కంటం బాలకృష్ణ, కంటం భూపతితో పాటు, పట్టణంలోని షెవ్వ స్వప్న కుటుంబాలను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. పార్టీ మండల అధ్యక్షుడు బొదిరే స్వామి, పట్టణ అధ్యక్షుడు జేజే నర్సయ్య, బాల్కొండ, మెండోరా మండలాల పార్టీ అధ్యక్షులు వెంకటేష్ గౌడ్, ముత్యం రెడ్డి, డీసీసీ డెలిగేట్ కుంట రమేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్ఐటీలో సీటు సాధించిన విద్యార్థులకు సన్మానం

పెర్కిట్(ఆర్మూర్): జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమ ర్యాంకు సాధించి ఎన్ఐటీలో సీటు సాధించిన ఆర్మూర్ మండలం చేపూర్ క్షత్రియ జూనియర్ కళాశాల విద్యార్థులను కళాశాల చైర్మన్ అల్జాపూర్ శ్రీనివాస్ శనివారం ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపల్ నాగేశ్వర్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

నలందలో ఆరంభ్ కార్యక్రమం

పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లి నలంద హైస్కూల్‌లో ఆరంభ్(ఫ్రెషర్స్ పార్టీ) వేడుకలు నిర్వహించారు. పాఠశాలలో నూతనంగా చేరిన విద్యార్థులను పుష్పగుచ్ఛాలతో ఆహ్వానించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల యాజమానులు నలంద ప్రసాద్, నలంద సాగర్, ఉపాధ్యాయినిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

ఆర్మూర్‌టౌన్: రైతులకు రుణమాఫీ చేస్తున్న సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఆర్మూర్ పట్టణ రెండవ వార్డులో మున్సిపల్ కౌన్సిలర్ ఖాందేష్ సంగీత ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ నాయకులు ఖాందేష్ సత్యం, మక్కల సంతోష్, బాజన్న, దండుగుల సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

మహాజన సభ

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలో శనివారం సొసైటీ చైర్మన్ తంబూరి శ్రీనివాస్ అధ్యక్షతన మహాజన సభ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రభుత్వం ఐదు ఎకరాల సాగు భూమి ఉన్న రైతులకు రైతబంధు పథకం అమలు చేయాలని తీర్మానించారు. అనంతరం కార్యదర్శి సొసైటీ ఆదాయ వ్యయాలను చదివి వినిపించారు. సొసైటీ వైస్ చైర్మన్ చేపూర్ రాజేశ్వర్, డైరెక్టర్లు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో కోళ్ల మృతి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని యోగేశ్వరకాలనీలో గల ఓ ఇంట్లో కోళ్లపై కుక్కలు దాడి చేసి చంపేశాయి. తన ఇంట్లో శనివారం ఉదయం 3 గంటల సమయంలో కుక్కలు చొరబడి కోళ్లపై దాడి చేసి చంపినట్లు బాధితుడు పల్లబోయదాస్ తెలిపారు. కుక్కలు గోడ దూకి ఇంట్లోనికి ప్రవేశించి మూడు జాలీలను తొలగించి కోళ్లను చంపేశాయన్నారు. సుమారు రూ.12 వేల నష్టం వాటిల్లిందన్నారు.